సమాజంలో మహిళలను గౌరవించాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి హాజరైన మహిళలు, శ్రీ వేంకటేశ్వరస్వామి వేషాధారణలో వచ్చిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, మార్చి 5 : సమాజంలో మహిళలను పురుషులతో సమానంగా గౌరవించాలని అప్పుడే సమాజంలో అభివృద్ధి సాధ్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం శంషాబాద్ పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో సిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలను పురుషులతో సమానంగా గౌరవించాలన్నారు. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు లేని సమాజాన్ని ఊహించలేమని వివరించారు. మహిళలలో అనంతశక్తి దాగి ఉందన్నారు. గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ఉద్యోగాలు, రాజకీయాలు, వ్యాపారాలు చేస్తూ పురుషులతో సమానంగా రాణించి ధైర్యంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొలన్ సుష్మామహేందర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, మాజీ సర్పంచ్ గణేష్‌గుప్త, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు మేకల వెంకటేశ్, జాంగీర్‌ఖాన్, అజెయ్‌లతో పాటు సిరిస్వచ్ఛంద సంస్థ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి వెంకటేశ్వరస్వామి వేషాధారణతో అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

ఎమ్మెల్యే దానం నాగేందర్

ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఫిర్యాదు చేస్తున్న వినాయక్‌నగర్ బస్తీవాసులు

బంజారాహిల్స్,మార్చి 5: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్, దీన్ దయాళ్‌నగర్ బస్తీల్లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డిని ఆదేశించారు. బుధవారం బస్తీకి చెందిన పలువురు స్థానికులు, నేతలు ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి కబ్జాలపై ఫిర్యాదులు చేశారు.

వినాయక్‌నగర్ పర్వతాంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో ఆక్రమణలు వెలుస్తున్నా రెవెన్యూ సిబ్బంది స్పందించడం లేదని వారు పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగించడంతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఆర్‌వోపై విచారణ చేయాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌కు ఫోన్ చేసి వివరించారు. ప్రభుత్వ భూములను కాపాడే విషయంలో ఎలాంటి పక్షపాతం చూపించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. బస్తీ నేతలు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకాం, బీబీఏ, బీఏ, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్మెంట్, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్మెంట్, బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వెంకటేశ్వర కాలనీలో ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 5: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు జి.ఎం.గట్టయ్య అధ్యక్షతన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వెంకటేశ్వర కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో సమస్యలపై ఇంటింటికీ సీపీఎం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న, మోసగిస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్కదాన్ని అమలు చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, గ్యాస్ సబ్సిడీ, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ప్రతి నెలా రూ.2500 అమలు కావడం లేదన్నారు. చాలా మంది మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు మేలు చేసేలా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించేలా చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు మణెమ్మ, జి.ఎం.కురుమయ్య, ఎన్.జంగయ్య, భాస్కర్, జి.ఎం.చైతన్య, మొగులయ్య, లక్ష్మణ్‌నాయక్, చెన్నయ్య, లక్ష్మణ్, వెంకటస్వామి, తిరుమలేశ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

పీఅండ్ టీ కాలనీలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

బండ్లగూడ మార్చి 5: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీ అండ్ టీ కాలనీలో అక్రమ నిర్మాణాన్ని బుధవారం టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులు రావడంతో అధికారులు పరిశీలించి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ అధికారినీ వాణి తెలిపారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు ఎక్కడైనా చేపడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

చెరువు స్థలంలో నిర్మాణాలు

ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ కేసు

బంజారాహిల్స్,మార్చి 5: చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపట్టిన ఇద్దరు వ్యక్తులపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట మండల పరిధిలోని హకీంపేటలో తుమ్మలకుంట చెరువుకు చెందిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో కొన్నాళ్లుగా మహమ్మద్ ఒమర్ పాషా, అక్బర్ అనే వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై ఫిర్యాదులు అందుకున్న షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డితో పాటు నీటిపారుదలశాఖ, జీహెచ్ఎంసీ అధికారులు నాలుగురోజులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. మూడు షెట్టర్లతో పాటు కొత్తగా నిర్మిస్తున్న భవనం ఎఫ్‌టీఎల్‌లోకి వస్తుందని తేలడంతో కూల్చివేతలకు ప్రయత్నించారు. అయితే ఒక భవనం కూల్చివేసేలోగా ఎంఐఎం ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అక్కడకు వచ్చి తన అనుచరులతో బెదిరింపులకు దిగాడు. దీంతో కూల్చివేతలు ఆపేసిన రెవెన్యూ సిబ్బంది వెనుతిరిగిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తోపాటు హైడ్రా అధికారులకు కూడా స్థానికులు ఫిర్యాదులు చేశారు. దీంతో వారి ఆదేశాల మేరకు షేక్‌పేట మండల తహసీల్దార్ వై.అనితారెడ్డి మంగళవారం రాత్రి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఒమర్ పాషా. అక్బర్‌ల మీద బీఎన్ఎస్ 329(3), 324(3) రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

పనిచేస్తున్న సంస్థకే టోకరా

ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

బంజారాహిల్స్,మార్చి 5: పనిచేస్తున్న సంస్థకు టోకరా వేసి డబ్బులు దండుకుంటున్న ముగ్గురు వ్యక్తులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లోని కాండిట్‌మెన్ పేరుతో సూట్స్,ఇతర వస్త్రాలు అద్దెకు ఇచ్చే షోరూమ్ ఉంది. దీనిలో మేనేజర్‌గా పనిచేస్తున్న మహ్మద్ అబ్దుల్ రహ్మాన్ కొంతకాలంగా కస్టమర్లకు డిస్కౌంట్‌తో బిల్లులు లేకుండా వస్త్రాలు ఇస్తూ డబ్బులు కాజేస్తున్నాడు. ఈ విషయంపై అనుమానం వచ్చిన స్టోర్ నిర్వాహకురాలు శ్వేతా పొద్దార్ విచారణ చేయగా గత ఏడాదితో పోలిస్తే తమకు రావాల్సిన కలెక్షన్లలో సుమారు రూ.30లక్షలు తగ్గినట్లు తేలింది. దీంతో స్టోర్ మేనేజర్ రహ్మాన్‌తోపాటు ఇతర సిబ్బందిపై నిఘా పెట్టగా వారి మోసం బయటపడింది. నగదు లావాదేవీల్లో డిస్కౌంట్ పేరుతో సంస్థకు చెందిన డబ్బులను కాజేస్తున్నట్లు తేలింది. రహ్మాన్‌తో పాటు అతడి భార్య జైనాబ్ అకౌంట్లలోకి సుమారు రూ.4.77లక్షలు పంపించారని తేలింది. ఈ వ్యవహారంలో రహ్మాన్‌తో పాటు సంస్థలో క్యాషియర్లుగా పనిచేసిన పవన్‌కుమార్, శ్యాంసుందర్‌లపై చర్యలు తీసుకోవాలని బుధవారం నిర్వాహకురాలు శ్వేతా పొద్దార్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బీఎన్ఎస్ 316(4), 318(4) రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉచిత క్యాన్సర్ శిబిరం

బొల్లారం, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆరో వార్డులో రోటరీ క్లబ్, ఆలిండియా జైన్ కటారియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భవ్య, గోపీనాథ్, ఆలిండియా జైన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ఆశాఅనిల్ కటారియా జైన్, ఉపాధ్యక్షురాలు రేఖసంజయ్ కటారియా, కోశాధికారి మమత కటారియా, కమిటీ సభ్యులు సునీత, రంజన, వైద్య సిబ్బంది ప్రసాద్, సత్యవతి, సంతోషి తదితరులు పాల్గొన్నారు

అధికారుల నిర్లక్ష్యం-స్థానికుల అవస్థలు

బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్యపై అధికారులను నిలదీస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 5: అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో స్థానిక ఫిర్యాదు మేరకు ఆయన బుధవారం జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. రోడ్ల దుస్థితి, డ్రైనేజీ వ్యవస్థ తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తేవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కనీస అవసరాలు కల్పించే విషయంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదన్నారు. ప్రతి రోజు తనకు డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెడ చెవినపెట్టడం లేదన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తేవాలన్నారు. ఈ పర్యటనలో జలమండలి అధికారులు రేణుక, వినయ్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, నాయకులు జోగి రవి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుదాస్, పురుషోత్తం, రాకేష్, శ్రీకాంత్‌రెడ్డి, పాండుయాదవ్, ఏ.శంకర్, మాలతీ, ప్రసాద్, సిద్ధప్ప, రాజు, రఘురెడ్డి, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టొద్దు..

ఏండ్ల తరబడి తక్కువ వేతనాలకు పని చేస్తున్నాం. తమలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలను సమష్టిగా ఆర్థిక సహాయం చేసుకుంటాం. మాకు అవకాశం కల్పిస్తూనే మిగతా వారిని తీసుకోండి. మా కడుపు కొట్టవద్దంటూ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది బుధవారం రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్యతో పాటు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ నీడలోనే జీవనం కొనసాగించగలరని నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో వారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

- వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 5:

సాయన్న సేవలు చిరస్మరణీయం

బొల్లారం, మార్చి 5: దివంగత ఎమ్మెల్యే సాయన్న సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం సాయన్న జయంతిని రసూల్‌పురా సిల్వర్ కాంపౌండ్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని పాల్గొని సాయన్న విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు, నాయకులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడు గు, బలహీన వర్గాల అభ్యున్నతికి సాయన్న ఎంతో కృషి చేశారని గుర్తు చేశా రు. ఎవరికి ఏ అవసరం ఉన్నా తానున్నాననే నమ్మకం కల్పించారని గుర్తుచేశారు. భౌతికంగా సా యన్న మన మధ్యలో లేకున్నా, నిరంతరం ప్రజల మనసులో నిలిచిపోయారని అన్నారు.

8మంది అరెస్ట్

-రెండు కేజీల గంజాయి స్వాధీనం

బంజారాహిల్స్,మార్చి 5: జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అపార్ట్‌మెంట్‌లో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులతో సహా మొత్తం 8మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. యూసుఫ్‌గూడ బస్తీకి చెందిన అడ్డూరి శివాజీ(26), శ్రీకాకుళం జిల్లాకు చెందిన హేమసుందర నాగరాజు(22), కాడె సాయి తేజేశ్వర్‌రెడ్డి(20), గార్లపాటి హేమవంశీ(20), పాలకుర్తి శ్రీకాంత్(27) అనే స్నేహితులు కొంత కాలంగా గంజాయికి అలవాటు పడ్డారు. తరచూ గంజాయి సేవించడం, స్థానికులతో గొడవలకు దిగడం పరిపాటిగా మారింది, ఈ క్రమంలో జల్సాల కోసం తామంతా కలిసి గంజాయి కొనుగోలు చేసి అవసరం ఉన్నవారికి అమ్మాలని నిర్ణయించుకున్నారు. మహారాష్ట్రకు వెళ్లి అమ్జద్ అనే వ్యక్తి వద్ద నుంచి పెద్ద మొత్తంలో గంజాయి తెచ్చి ఇక్కడ అమ్ముతున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి యూసుఫ్‌గూడ సమీపంలోని గణపతి కాంప్లెక్స్ వద్ద కాపు కాశారు. సాయి తేజేశ్వర్‌రెడ్డి ఇంట్లో ముఠా సభ్యులంతా గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా మారుస్తున్నారని గుర్తించిన పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరితోపాటు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన జహంగీర్(23), కుంచాల ఉదయ్ వెంకట్(23), దోమ రాకేష్(25) అనే వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 2కేజీల గంజాయితోపాటు 10 మొబైల్ ఫోన్లు, రెండు బైక్‌లు, కస్టమర్ల నుంచి ఫోన్ పే ద్వారా వసూలు చేసినట్లు ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, మార్చి 5: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ డెఫ్(డి.ఎస్. డి) రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు కోరారు. బుధవారం భాగ్‌లింగంపల్లిలోని డి.ఎస్.డి కార్యాలయంలో ఆయన మాట్లాడారు కేంద్ర ప్రభుత్వం యు డి ఐ డి కార్డ్స్ జారీ హామీ ఇవ్వడం మంచి పరిణామం ఉన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. దివ్యాంగులకు అందరికీ 10 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ స్థలంలో..హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ఆక్రమిస్తే..క్రిమినల్ కేసులు

అంబేద్కర్‌నగర్ బస్తీ నాలా పక్కన ఖాళీ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

బంజారాహిల్స్,మార్చి 5: బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లోని అంబేద్కర్‌నగర్ బస్తీని ఆనుకుని ఉన్న నాలా పక్కన ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న ప్రయత్నాలను షేక్‌పేట మండల రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. షేక్‌పేట మండలంలో నివార్డ్ 11, బ్లాక్ -ఆర్, టీఎస్ నెంబర్ -4లో నాలా స్థలంగా ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న సుమారు 1500 గజాల ఖాళీ స్థలంపై కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కన్నేశారు. పదిరోజులుగా స్థలాన్ని చదును చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం రాత్రి అక్రమంగా టిప్పర్లతో మట్టిని తీసుకొచ్చి స్థలంలో నింపుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారుల ఫిర్యాదుతో టిప్పర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి స్పందించి తమ సిబ్బందిని స్థలం వద్దకు పంపించారు. ఆ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. ప్రైవేటు వ్యక్తులు స్థలంలోకి వస్తే క్రిమినల్ కేసు నమోదు చేయిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

'చెత్త'పై అధికారుల నిర్లక్ష్యం

ఓ పక్క పంజాగుట్ట ఏసీపీ కార్యాలయం....మరో పక్క ట్రాఫిక్ పోలీసు స్టేషన్.... మధ్యలో దెబ్బతిన్న తడి, పొడి చెత్త బిన్లు. నిత్యం వీఐపీలు తిరిగే పంజాగుట్ట ప్రధాన రహదారిలో బిన్ల దుస్థితి ఇది. జీహెచ్ఎంసీ 'చెత్త'శుద్ధికి నిదర్శనమంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

-ఖైరతాబాద్, మార్చి 5

'సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

బేగంపేట, మార్చి 5: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బన్సీలాల్‌పేటకు చెందిన ఏడుగురికి కల్యాణలక్ష్మి 5, షాదీముబారక్ ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలలో ఆడపడుచు పెండ్లి ఆర్థికంగా ఎంతో భారంతో కూడుకున్నదని పేర్కొన్నారు. వారికి చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో కేసీఆర్ రూ.లక్ష 116ల సహాయం అందించే గొప్ప కార్యక్రమం ప్రారంభించారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, ముషీరాబాద్ ఆర్ఐలు సత్యప్రసాద్‌రావు, ప్రణీత్‌రావు, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు, ఆకుల హరికృష్ణ, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, మహేష్‌కుమార్‌యాదవ్, గజ్జెల శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మారేడ్ పల్లి: మోండా డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మారేడుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమం బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

చిక్కడపల్లి, మార్చి 5: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. చిక్కడపల్లి బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం" సందర్భంగా బుధవారం చిక్కడపల్లిలోని బ్రహ్మకుమారిస్ కేంద్రంలో కుటుంబం, సమాజంలో శాంతి మరియు సామరస్యాన్ని నెలకొల్పడంలో మహిళల పాత్ర అనే అంశంపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఠాగోపాల్ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబం, సమాజంలో శాంతి , సామరస్యాన్ని నెలకొల్పడంలో మహిళల పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేష్, చిక్కడపల్లి బ్రహ్మ కుమారి స్ కేంద్రం ఇన్చార్జి జయశ్రీ, ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో

పెయింటర్ మృతి

- పది రోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి
- పెద్దషాపూర్ గ్రామంలో విషాదఛాయలు

జీళ్ల అభిలాష్ ముదిరాజ్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, మార్చి 5 : రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి చెందిన ఘటన బుధవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసు కున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దషాపూర్ గ్రామానికి చెందిన అభిలాష్ తండ్రి జీళ్ల కృష్ణముదిరాజ్ పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి శంషాబాద్ పట్టణంలోని శ్రీవెండికొండ సిద్దేశ్వరస్వామి ఆలయం వద్ద నిద్రచేయడానికి వచ్చారు.బుధవారం ఉదయం 9 గంటల సమయంలో అభిలాష్‌తో పాటు అతడి బావ చరణ్ ఇద్దరు కలిసి శంషాబాద్ నుంచి పెద్దషాపూర్ గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిలో ఘాన్సిమియాగూడ గ్రామం దాటుతున్న సమయంలో ముందుగా వెళ్తున్న ఆటో సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో అభిలాష్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన అభిలాష్‌ను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పది రోజుల వ్యవధిలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే..

చిక్కడపల్లి, మార్చి 5: కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదముతోనే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం చోటుచేసుకుందని , ఈ ఘటనలో 8 మంది కార్మికులు బలి అయ్యారని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. బుధవారం గాంధీనగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు.